531059001

తామరాకుపై తళతళలాడే
నీటి బొట్టు వలె నిలకడ లేనిది
బ్రతుకభిమానపు పొరల కాంపరా
దిగులు దుఃఖముల తెరరా లోకము
హరిగోవిందా హరిగోవిందా
హరి గోవిందా అనరా మందా!

విద్యార్థులారా!

ఆధ్యాత్మికమంటే ఏమిటో, వ్యక్తిగతమైన స్వాతంత్ర్యమంటే ఏమిటో ఈ రెండింటి యొక్క యదార్థ స్వరూపాన్ని గుర్తించటం సామాన్య మానవులకు సాధ్యము కాదు. ఈ ఆధ్యాత్మికమనగా కేవలము ఒంటరితనమని గాని, ఏకాకి జీవితమని గాని భావించరాదు. యావత్ మానవ జీవితము మధ్య ప్రేమ బీజములు నాటి కాంతి ప్రసూనములు వికసింపజేసి పవిత్రప్రేమను ప్రజలకు అందించటమే ఈ ఆధ్యాత్మికము యొక్క అంతరార్థము. ఇందులో ప్రత్యేకమైన దివ్యత్వమునే మనము విచారించినప్పుడు ఇక్కడ ఆధ్యాత్మికమని గాని వ్యక్తిగతమైన స్వాతంత్ర్యమని గాని రెండు లేవు. ఇంతవరకు జరిగిన డిబేటులో హృదయమంటే ఏమిటో వారు గుర్తించి వర్తించలేదు. స్వాతంత్ర్యమనేది వేదికపైన తనయొక్క భావమును ప్రకటించటమే స్వాతంత్ర్యమని భావించారు. స్వాతంత్ర్యమన్నది ఈ జగత్తునందు ఎవ్వరికీ లేదు. కానీ రాజకీయంగా స్వాతంత్ర్యమని ఒకపేరు వచ్చింది. ఈ స్వాతంత్ర్యమనగా ఏమిటి? విదేశీయుల పరిపాలన నుండి వారిని పంపి స్వదేశీయుల పరిపాలనను స్వీకరించటము స్వాతంత్ర్యమని భావించారు. ఇది వ్యక్తిగతమైన freedom కాదు. fundamental స్వాతంత్ర్యము కాదు. కేవలము అహంకార తత్వమును ప్రకటించే నిమిత్తమై కొన్ని ఆచరించిన చర్యలు మాత్రమే. విదేశీయులు పోయిన తరువాత స్వదేశీయులు స్వాతంత్ర్యము పొందినారనుకున్నాము. ఏందులో స్వాతంత్ర్యము పొందాము. కేవలము స్వాతంత్ర్యము, స్వాతంత్ర్యము అన్నంత మాత్రమున ప్రయోజనమేమి లేదు.

ఐక్యతను సాధించినప్పుడే స్వాతంత్ర్యము ప్రయోజనమవుతుంది. ఐక్యమను

సాధించక స్వాతంత్ర్యము స్వాతంత్ర్యమను కుంటే అది కేవలము పదము యొక్క స్వాతంత్ర్యమే గాని నిజ స్వాతంత్ర్యము కాదు. స్వాతంత్ర్యమనేది హృదయ స్థాయి నుండి ఏర్పడాలి. హృదయ మంటే ఏమిటి? కేవలము రక్త మాంసములతో కూడిన ఈ గుండె కాదు. హృదయమనగా ఒక స్థానమునకు గాని ఒక కాలమునకు గాని ఒక దేశమునకు గాని సంబంధించినది కాదు. సర్వత్ర సర్వకాలములందు కూడను సర్వదేశములందు కూడను సర్వవ్యక్తులందు కూడను సమత్వముగా వుండే దివ్యతత్వమే హృదయము. ఈ హృదయమునకు రూపము లేదు. కాని మానవుని యొక్క దేహమునందు దేనిని మనము హృదయముగా భావిస్తున్నామో అది మధ్య లో వచ్చి మధ్యలో పోయేది. దేనిని గుర్తిస్తే సర్వమును గుర్తించిన వాడౌతాడో అంతటి దివ్య తత్వమును గుర్తించటమే నిజమైన స్వాతంత్ర్యము.

'యథా అండాండే తథా బ్రహ్మాండే' అన్నారు. అండాండ మనగా వ్యక్తిగతమైనది బ్రహ్మాండమనగా సమిష్టిస్వరూపము. తనను తాను గుర్తించుకున్న వ్యక్తి సర్వమును గుర్తించ గలడు. ఇతే తానంటె ఎవరు? ఈ నాటి మానవుడు ప్రపంచములో సర్వమును తెలుసుకొ నుటకు ప్రయత్నిస్తున్నాడు. సర్వము తెలియునని విఱ్ఱవీగుతున్నాడు. ఒకవేళ తెలియక పోతే తెలుసుకొనుటకు ప్రయత్నిస్తున్నాడు. కాని మానవుడు తానెవరో తన తత్వమేమిటో తెలుసుకొనకుండా సర్వమును తెలుసుకొనుటకై ప్రయత్నిస్తున్నాడు. ఉపనిషత్తునందు ఉద్దాలకుడనే మహాపండితుడు తన కుమారుడైన శ్వేతకేతుని విద్యాభ్యాస నిమిత్తమై యింకొక గురువు దగ్గరకు పంపినాడు. పన్నెండు సంవత్సరములు చక్కగా సర్వవిద్యలు గ్రహించాడు. కాని అన్ని తెలుసునని విఱ్ఱవీగి వెళ్ళినవాడై తన తండ్రి దగ్గరకు వచ్చి 'నాన్నా! నేను సర్వవిద్యలు నేర్చుకున్నాను' అన్నాడు. అప్పుడు నాన్న ప్రశ్నించాడు, 'నాయనా! ఏమి తెలిసిన సర్వమును తెలిసినట్లవుతుందో దానిని నీవేమైనా చదువుకున్నావా' అన్నాడు. శ్వేతకేతుడు కొంత అహంకారమునుండి క్రిందకు దిగాడు. అన్నింటి కంటె విద్యా అహంకారము వెఱ్ఱితలు వేస్తూ వుంటుంది. అప్పుడు లోక జ్ఞానము కంటె ఆత్మజ్ఞానము బ్రహ్మజ్ఞానము అవసరమని తన కుమారుడైన శ్వేతకేతునికి చక్కగా బోధించాడు. ఒక చిన్న ఉదాహరణము. ఎవరినైనా మనము చూచినప్పుడు మీరెవరండి అని ప్రశ్నించినప్పుడు అతను నేనెవరో నాకు తెలియదంటె మనము ఏమని భావిస్తాము. అదే విధముగనే నీవెవరో నీకు తెలియనప్పుడు యితరమైన దానిని గురించి తెలుసుకొనుటకు ప్రయత్నించినప్పుడు నీవు కూడ అడిగినవాని కంటె పిచ్చివాడవు కదా. కనుక మొట్టమొదట తనను తాను గుర్తించుకో

దీనికి ప్రయత్నించాలి. లేక దానికి జవాబు చెప్పవచ్చు. ఫలాని రామయ్యను అని చెప్పవచ్చు నేను రామయ్యను అన్నప్పుడు రామయ్య దేహము యొక్క పేరు. నేను అనేది ఎవరు? రామయ్యను నేను అనేది ప్రత్యేకముగా ఒకటి వుంటున్నది కదా. ఆ యొక్క నేను తత్వాన్ని మాత్రము గుర్తించాలి. ఆ నేను అనేదే హృదయము. నేను అనేదే ఆత్మ. నేను అనేదే బ్రహ్మము.

ఈ హృదయము సర్వత్ర వుండినది. ఒక చిన్న ఉదాహరణము. ఒక చిత్రకారుడు ఒక కాగితముపైన చక్కగా ఒక నర్తకిని చిత్రించాడు. ఇక్కడ కాలు వంగింది. చేయి వంగింది. వేలు వంగింది. అనేక రకములుగా నృత్యము చేసినట్లుగా చిత్రించాడు. తల తిప్పినట్లుగా కనుపించింది. కాలు వంచినట్లుగా కనుపించింది. చేయి వంచినట్లుగా కనుపించింది. వేలు వంచినట్లుగా కనుపించింది. అన్ని వంపులతోను హెచ్చు తగ్గులతోను కనుపించింది ఆ చిత్రము. దృశ్యమునకు హెచ్చు తగ్గులుగా కనుపిస్తున్నది గాని ఆ కాగితము మనము తడిమి చూస్తే ఏ హెచ్చు తగ్గులు లేవు. కొన్ని చిత్రముల లోపల పర్వతాలుగా కొండను ఎత్తుగా తగ్గగా పల్లముగా ఈ విధముగా కనుపిస్తుంటాయి. కాని కాగితమును మనము అంటి చూస్తే ఇందులో ఏమాత్రము హెచ్చు పల్లములు లేవు. ఈ విధముగనే ఈ హృదయమునందు ఈ జగత్తనేది హెచ్చు పల్లములు, మంచి చెడ్డలు, పాపపుణ్యములు సత్యాసత్యములు, కష్టసుఖములు ఈ విధమైన వ్యత్యాసములు మనకు కనుపిస్తూ వుండినప్పటికిని హృదయస్థాయి యందు ఇందులో ఏమాత్రము భేదములు కనుపించవు. ఆది అంత్యము లేనిది మధ్యలో కనుపించినప్పటికిని అది కూడా లేనటువంటిదే. ఇది ఒక టంబ్లరు అంటాము. దీనికి రూపము ఒకటి నామము ఒకటి వుంటున్నాది. ఇది రూపము టంబ్లరు అనేది నామము. ఈ రూపనామములు తీసివేస్తే వుండేది ఏమిటి? వెండి మాత్రమే. ఇది టంబ్లరు కాక పూర్వము వెండే. టంబ్లరు సమయమునందు ఇది వెండే. దీనిని చెడగొట్టి ముద్దగా చేసినప్పుడు అది వెండే. ఇది ఆది అంత్యమునందు వెండిగానే వుంటున్నాది. మధ్యలో వచ్చినదే ఈ రూపము. కనుకనే దీనికి మిథ్యా జగత్తు అని పేరు వచ్చింది. జగత్తునందు ఏకం సత్. వున్నది ఒకటే. రెండవది వుంటేనే కదా స్వాతంత్ర్యమో బంధనో అనేది కనుపిస్తుంది. ఈ బంధము, స్వాతంత్ర్యము అనేవి మనో కల్పితాలు.

విద్యార్థులారా! సూర్యుడు లేనప్పుడే చంద్రునకు మనము విలువ ఇస్తాము. సూర్యుడే వుండినప్పుడు చంద్రుని ఎవరు చూడరు. పోని సూర్యుడు లేనప్పుడు చంద్రునికి విలువ ఇస్తున్నామంటే దేనివల్ల విలువ ఇస్తున్నాము. చంద్రుడు స్వతః ప్రకాశకుడు

కాదు. సూర్యుని యొక్క కిరణములు చంద్రుని మీద పడినప్పుడే చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. అదే విధముగానే మనము ఆత్మస్వరూప సమయమునందే చంద్రుడనే మనస్సునకు మనము విలువనిస్తున్నాము. ఇదే వేదమునందు చంద్రమా మనసో జాతః చక్షోః సూర్యో అజాయత ఈ మనస్సుకు చంద్రునకు వుండిన బింబ ప్రతిబింబముల సంబంధమును వేదము యీ రీతిగా నిర్ణయించింది. కనుక మనము ఆత్మవిచారము లేనంత వరకు కూడను మనస్సుకే ఎక్కువ బలమును, ఎక్కువ సమయమును ఎక్కువ ప్రాధాన్యమును యిస్తున్నాము. కనుక యీ మనస్సనేది స్వతసిద్ధమైన ప్రకాశము కాదు. కనుక మనస్సు వుండిన వానికే స్వాతంత్ర్యము, బంధన. మనస్సు వుండిన వానికే ఆధ్యాత్మికము, పారమార్థికము, లౌకికము. మనస్సు వుండిన వానికే ప్రకృతి పరతత్త్వము మనసు వుండినవానికే స్త్రీ పురుషుడు అనే భేదభావము. సర్వద్వంద్వము కూడను యీ మనస్సు వలననే యేర్పడినది.

ఈ నాడు లోకములో స్వాతంత్ర్యము రెండు రకములుగా వుంటున్నది. ఇప్పుడు కొంతవరకు వాదన జరిగింది. ప్రభుత్వ సంబంధమైన స్థాయి లోపల యిది యీ రీతిగా చెయ్యాలి యిది యీ రీతిగా చెయ్యాలి కొన్ని కొన్ని నిబంధనల చేత కొన్ని కొన్ని స్వాతంత్ర్యములను అనుభవిస్తున్నాము. దీనిని మనము స్వాతంత్ర్యమని చెప్పటానికి వీలు లేదు. ఇక్కడ అంతా కేవలము ఒక rules and regulations అని వుంటున్నది. ఇంక వ్యక్తిగతమైన దానిని విచారణ చేస్తే యిది కూడను స్వాతంత్ర్యము కాదు. ఇది కేవలము మానవుని సంకల్పము యొక్క ప్రభావము. ఇది తన మనోభీష్టములను నెరవేర్చుకొనే నిమిత్తమై అనుసరించే స్వార్థము. అందులో కూడను స్వార్థము లేదు. ఒకడు బాగా బీదవాడుగా వుంటున్నాడు. ఆ బీదవాడుగా వుండినప్పుడు వానికి కొంత అన్నము కావాలి. ఎవరిని అడిగినా పెట్టరు అప్పుడు నా ఆకలిని తీర్చుకొనే నిమిత్తము దొంగతనము చేస్తాను నాకిది స్వాతంత్ర్యము అంటాడు. తన స్వార్థమును పురస్కరించుకొని నేను యీ విధముగా దొంగతనము చేయవచ్చని అనుకుంటున్నాడే గాని తన conscious అనేది ఒప్పుకోటం లేదు. తన conscious ఒప్పుకోనప్పుడు స్వాతంత్ర్యము విల్లా అవుతుంది. ఇది కేవలము ఒక బంధనలో కూడిన స్వాతంత్ర్యముగానే వుంటుంది. కనుక మానవత్వములో నిజమైన స్వాతంత్ర్యము ఎప్పుడు వస్తుందంటే యీ మనస్సును నిర్మూలము గావించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యము వస్తుంది. స్వ-యిచ్ఛ స్వేచ్ఛ. అదే స్వేచ్ఛ అంతేగాని

దేహేంద్రియ మనో బుద్ధులతో ఆచరించే కర్మలన్నీ స్వాతంత్ర్యములు కావు. కొన్ని కొన్ని వాటి యందు Law of nature ప్రకృతి ననుసరించి కొన్ని మనము ఆచరిస్తూనే వుంటాము. ఇది కూడను స్వాతంత్ర్యము కాదు. Law of nature ఒకటి Rules and regulations మరొకటి. ఈ రెండింటి మధ్యలోనే మానవ జీవితము సాగుతున్నది. అంతేగాని ఎవరికి వారు నేను స్వతంత్రుడను నేను స్వతంత్రుడను అని అనుకోటానికి వీలు లేదు.

దివ్యత్వము ఒక్కటి మాత్రమే స్వాతంత్ర్యము. దానిని కూడను స్వాతంత్ర్యమని చెప్పటానికి వీలు లేదు. ఉన్నది ఒక్కటే ఆ పదమునకు అక్కడ స్థానమే లేదు. ఒక చిన్న ఉదాహరణము. కొంత మంది అంటూ వుంటారు నేను స్వామికి సంపూర్ణ శరణాగతుడనై పోయినాను కానీ నా బాధలు తగ్గలేదు, నా దుఃఖములు నివారణ కాలేదు. నా కష్టములు నివారణ కాలేదు. అని అనుకుంటారు. నా యొక్క భావమునందు యిది శరణాగతి కానేరదు. నిజముగా శరణాగతి యైతే నా బాధలు తగ్గలేదు. నా కష్టములు తీరలేదు అనే ప్రశ్నకు అవకాశము లేదు. ఇంకా కొంత మంది నేను ధ్యానములోపల కొంత వరకు సమాధిని పొందుతున్నాను అంటాడు. సమాధి అంటే యేమిటి? ప్రాకృతమైన దృష్టియందు ప్రాకృతమైన వ్యక్తులు రచించిన గ్రంథములందు సమాధి తత్త్వాన్ని అనేక రీతులుగా వర్ణించవచ్చును ధ్యానములో వుండి తన్మయత్వాలుగా పడిపోవచ్చును. కాని సమాధిలో వున్నాడనుకుంటాము. దీనికి సమాధి అనే పేరు సార్థక నామము కాదు. ఇది కేవలము ఒక emotion కావచ్చు లేక హిస్టీరియా కావచ్చు. లేక ఫిట్సు కావచ్చు. లేక weakness కావచ్చు కాని యిది సమాధి కానేరదు. సమాధి అనగా ఏమిటి? మనస్సును ఆత్మలో చేర్చుటయే సమాధి. ఆ స్థితి యందు రెండు అనేది యిక్కడ కనుపించదు. సమ-ధీ ఒకే సమానత్వమైన బుద్ధి సుఖ దుఃఖములను గాని, ఆదాయ నష్టములను గాని, పాప పుణ్యములను గాని, ప్రకృతి పరమాత్మలను గాని యే మాత్రము భేదము లుండవక్కడ. ఆ స్థితి యందు మాత్రమే అది సమత్వమును పొందుతుంది. అదే నిజమైన స్వభావం. కనుక మానవ జీవితములో మనము దేనిని పొందాలని ఆశిస్తున్నామో పొందే దాని నిమిత్తమై యే విధమైన దానిని అనుసరిస్తున్నామో ఈ విధమైన భావములు వుండినంత వరకు కూడను యిది కేవలము మానసిక వికారములే. మనసు వుండినంత వరకు స్వాతంత్ర్యము ఎవరికి లేదు. ప్రాకృతమైన మార్గములో యిది నా స్వాతంత్ర్యము, నా ధనము నేను అతనికి యిస్తున్నాను యిది నా స్వాతంత్ర్యము అనుకోవచ్చు. ఇది స్వాతంత్ర్యము కాదు. అది స్వేచ్ఛ కాదు. మనో భావములో

యేర్పడిన కాన్ని సహజ సాత్విక గుణములు. మనస్సు అన్నిగుణముల యొక్క మిశ్రమమై వుంటున్నాది. ఒక్కొక్క సమయములో ఒక్కొక్క గుణము అభివృద్ధియై వుంటున్నాది. అతనికి నేను ఒక రూపాయి యివ్వాలని సంకల్పించుకుంటాను. దానికి ఎవరి యిష్టము అక్కర లేదు. నా స్వాతంత్ర్యము అంటాము. ఇదంతా స్వాతంత్ర్యమునకు సంబంధించినది కాదు. వాని యొక్క పరిస్థితిని, వాని యొక్క ప్రార్థనను కొంత వరకు మనస్సు అంగీకరించి తద్వారా నీవు యిచ్చే ఒక దానమే గాని నిజమైన స్వాతంత్ర్యము కాదు.

కనుక మానవుని యందు స్వేచ్ఛ అనేది వుండటానికి వీలే లేదు. జస్టిస్ కస్తూరి చెప్పింది ఒక వ్యక్తి ఒక కత్తిను చేతిలో పెట్టుకొని తాను exercise చేస్తున్నాడు. అది తన కాంపౌండు లో చేసుకోవచ్చును. తన Terrace పైన చేసుకోవచ్చును. యిది స్వాతంత్ర్యము కావచ్చును. అదే కత్తిను తీసుకుని మధ్య బజారు లోపల త్రిప్పుతూ కూర్చుంటే పోలీసులు వచ్చి అరెస్టు చేసి పిచ్చివాడని జైలులో పెడతారు. ఇది పబ్లిక్ రోడ్డులో చేసేది స్వాతంత్ర్యము కాదు. గవర్నమెంటు రూల్సు అండ్ రెగ్యులేషన్సుకు విరుద్ధముగా చేసినట్లవుతుంది తన కాంపౌండులో తన టెర్రస్ పైన చేయుటం కూడను స్వాతంత్ర్యము కాదు. ఇది కేవలము తన యిష్టము. ఇష్టమునకు స్వాతంత్ర్యమునకు చాలా వ్యత్యాసము వుంటున్నది. ఇష్టము వస్తువును బట్టి స్వార్థమును బట్టి వినియోగించుకోవచ్చును. కనుక యే వస్తువైనా గాని ఏ స్థానమందైనా గాని ఏ వ్యక్తి యందైనా గాని, ఏ కాలమందైనా గాని తన హృదయ భావము నుండి వచ్చినది నిజమైన స్వాతంత్ర్యము. ఇది హృదయము నుండి ఆవిర్భవించాలి. హృదయాన్ని వదలి ఏదో లౌకికమైన స్థితిగతులను పురస్కరించుకొని యిది స్వతంత్ర్యము కోటం కేవలము పేరుకు స్వాతంత్ర్యమే గాని ప్రవర్తనలో స్వాతంత్ర్యము దీనికి లేదు. మానవ జీవితములో వున్నతమైన స్థాయిని పొందిన వ్యక్తులకు మేధాశక్తులు కేవలము యెక్కడనుండియో వచ్చినవి కావు. అన్ని తన నుండి వృద్భవించినవే. ఒకానొక సమయములో అర్జునుడు కృష్ణుని ప్రశ్నిస్తాడు చంచలంహి మనః కృష్ణా ప్రమాది బలవద్దృఢమ్ కృష్ణా! యీ చంచలమైన మనస్సు చేత దేనిని సాధించలేక పోతున్నాము. ఏ చిన్న కార్యము నందైనను మనము విజయాన్ని సాధించాలంటే అచంచల హృదయుడు కావాలి. చంచల చిత్తముతో సాధించలేము. నేను చాలా బలహీనుడని అనుకుంటాము. నేను కేవలము కొన్ని విధములైన సాధనల చేత సాధించానను కుంటాము.

విద్యార్థులారా! ఏవరు కూడను ఏది సాధించినప్పటికి ఒకరి వల్ల ఒకరు

సాధించామనుకోటం అజ్ఞానము. సర్వము నీయందే వుంటున్నాది. నీయందుండిన దానిని నీవు బహిర్గతము గావించుకోటమే నీవు చేసే ప్రయత్నము. వున్నది ఒకటే అయినప్పుడు దానిని పొందటానికి వేరే సాధనలు ఎందుకు. మనస్తత్వమునుండి అవిద్యా భావమును దూరము గావించుకోటమే మనము చేయవలసిన సాధన. ఈ మానసిక వృత్తులను అరికట్టుకోటమే సాధన. సర్వము నీయందే వుంటున్నది. దానినే కృష్ణుడు అర్జునునికి ఉపదేశము చేసినది. అర్జునా! నీవు పుట్టినప్పుడు విలువిద్య తెలియదు నీకు. మీరందరు పుట్టినప్పుడే యీ విద్యలన్నీ నేర్చుకొని రాలేదు. క్రమక్రమేణా ఏదో గొప్ప విద్యలు మీరు నేర్చుకున్నారని భావిస్తున్నారు. ఇవి నేర్చుకున్నవి కాదు. నీయందున్నవి నీవు ఆవిర్భవింప చేసినవి. అర్జునా! నీకు ద్రోణాచార్యుడు విలువిద్య నేర్పించినాడని భావిస్తున్నావు. ద్రోణాచార్యుడు నీకు విద్యలు నేర్పలేదు. నీయందుండిన దానినే తాను బయటకు చూపించాడు. నీలో లేని దానిని ఏ గురువైనా సరే ఏ మహత్తరమైన శక్తిగలవాడైనా సరే లేని దానిని తెప్పించటానికి వీలుకాదు. అదృష్టము కాని దురదృష్టము గాని, ఆనందము గాని దుఃఖము గాని యివన్నియు మనయందున్నవే. ఇప్పుడు ఒక బావి త్రవ్వినాము. ఈ బావి నూరు అడుగులు త్రవ్వేటప్పటికి నీరు వచ్చింది. ఆ నీరును నీవు తెప్పించావా. నీరు అక్కడ వుండనే వున్నది. దానికి నీవు మధ్యనున్న మట్టి తీసివేయటం వలన నీరు కనుపించింది. అంతేగాని నీవు క్రొత్తగా ఆ నీటిని సృష్టించలేదు. అదే విధముగా అర్జునా నీలో వున్న దివ్యశక్తిని నీవు మరచినావు. నీవు మరచటానికి కారణము ఏమిటి? దేహతాదాత్మ్యము పొందటం వలననే. నీవు మరచిపోయావు కనుక ప్రతి ఒకటి కూడను దివ్యత్వము గాని, పవిత్రము గాని, అపవిత్రము గాని, దుఃఖము గాని, ఆనందము గాని మనలో వుండినవే. ఇది నేను స్వతంత్రమనుకుంటే యిది నీకు స్వాతంత్ర్యము కాదు. వున్నదే అది. ఇది స్వేచ్ఛ అనుకుంటే యిది స్వేచ్ఛ కాదు. కర్తృత్వము. కనుక free will అని చెప్పుటలో లోపల దీనికి అర్థమే లేదు. free will అనేది ఒకటుంది. అదే హృదయస్థాయి. అది ఎప్పటికి వున్నది. ఒక తూరి వచ్చి ఒక తూరి పోయేది కాదు. మనోభావము వుండినంతవరకు మానవునిలో భావములు అభివృద్ధి పొందుతూ వుంటాయి. కనుక మనస్సు యొక్క స్వాతంత్ర్యములే గాని మనిషి యొక్క స్వాతంత్ర్యములు కాదు. సంపత్తు చెప్పారు. ఒక స్టూడెంటు తాను ఏదో ఒక విధముగా కూర్చుని ప్రశ్న వేసి ఆన్సరు తెప్పించుకొనుటకు అతనికి స్వాతంత్ర్యము వుంది అని. యిది స్వాతంత్ర్యమని చెప్పటానికి వీలు లేదు. తెలియని విషయమును తెలుసుకోటానికి ప్రయత్నించాడు. ఈ ప్రయత్నించే విధానములో కూడను, తాను అడిగే పద్ధతిలో కూడ

కొంత వరకు మార్చుకోవాలి. వినయ విధేయతలను పురస్కరించుకొని తాను సరైన స్థితిగతులను పురస్కరించుకొని ప్రశ్నించటములో కూడను ఒక నిబంధన వుంటున్నాది. ప్రశ్న అడగటము దానికి జవాబు చెప్పించుకోటము స్వాతంత్ర్యమను కుంటున్నాము. స్వాతంత్ర్యము కాదు. ఇది విద్యావిధానములో వుండిన నిబంధన. యీ కర్తవ్యమిది.

కర్తవ్యమునకు స్వాతంత్ర్యమునకు వ్యత్యాసము వుంటున్నాది. సంబంధము, నిర్బంధము, కర్తవ్యము అని మూడు రకములుగా వుంటున్నది. ఐతే యీ మూడింటికి వున్న వ్యత్యాసము యేమిటి? ఇప్పుడు ఒక Sunday వచ్చింది. నీ friends అందరిని పిలచి టీపార్టీ పెట్టాలనుకున్నావు. ఆనాడు నాలుగు గంటలకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నావు. high temperature వచ్చింది. అప్పుడు తక్షణమే యీ friends కి ఫోను చేశావు. నాకు టెంపరేచరు అధికముగా వుంటున్నాది యీనాడు టీపార్టీ మానుకున్నాను అన్నారు. ఇది స్వాతంత్ర్యము అనుకుంటున్నాము. యిష్టమైతే పెట్టుకోవచ్చు యిష్టము లేకపోతే మానుకోవచ్చు. నీవు ఆఫీసులో వుంటున్నావు. అక్కడ కూడను అధికముగా టెంపరేచరు వచ్చింది. అదేనాడు నీ డైరక్టరు నీ ఆఫీసును విజిట్ చేస్తున్నాడు. నీవు అప్పుడు లీవ్ తీసుకోటానికి వీలు కాదు. డాక్టరు దగ్గరకు పోయి మాత్రలు వేసుకుని యింజక్షను తీసుకొని జ్వరముతోనే ఆఫీసుకు పోవాలి. ఇది నిర్బంధము. మూడవది కర్తవ్యము. ఏదో కొన్ని కారణాల వలన భార్యాభర్తలు పోట్లాడారు. యీ కోపము చేత భర్త ఆమెను రెండు కొట్టాడు. ఆమె యేడ్చుకుంటూ బెడ్‌రూమ్‌కి పోయి పడుకుంది. వంట చేయలేదు. పురుషుడు డ్రాయింగు రూములో కూర్చున్నాడు చాలా కోపంగా వున్నాడు. విషయములో వచ్చిన కోపం ఒకటి ఆకలితో వచ్చిన కోపం ఒకటి యీ రెండు చేరి తాను restless గా వుంటున్నాడు. ఆ సమయమునకు తగినట్లుగా ఒక friend వచ్చాడు అతను వచ్చేటప్పటికి నవ్వుతూ hello come on అన్నాడు. కూర్చోమని చెప్పాడు ఫ్రెండ్‌తో నవ్వుతూ వుత్సాహంగా మాట్లాడుతూ అతనితో కాలము గడపి లోపలికి పోయాడు నా ఫ్రెండు వచ్చాడు కాఫీ తెయ్యి అన్నాడు కోపంగా. ఫ్రెండుతో ఆనందముగా వున్నది భార్యకు తెలియకూడదు. భార్యతో కోపంగా వున్నది ఫ్రెండుకు తెలియకూడదు. ఇది కర్తవ్యము. ఈనాడు సంబంధము పోయింది. నిర్బంధము పోయింది. కర్తవ్యము అంతకంటె పోయింది యిదే ధర్మనాశనము. యిదే ధర్మగ్లాని అన్నారు. భార్యతో పోట్లాడిన వ్యక్తి డ్రాయింగు రూమ్‌లో వుంటే ఫ్రెండు వచ్చినప్పుడు get out అంటే యీ friend కి పిచ్చి పట్టిందేమో అనుకుంటాడు. సమయస్ఫూర్తిగా మన యొక్క భావములను గాని మన యొక్క చర్యలుగాని మార్చుకొనే

విధానమే కర్తవ్యము. ఈ విధమైన చర్యలలో నిర్బంధము, సంబంధము, కర్తవ్యము ఈ మూడింటి యందు మానవునకు స్వాతంత్ర్యము లేదు.

సమాజము యొక్క స్థితిగతులను బట్టి మన ప్రవర్తనలను మనము మార్చుకుంటున్నాము. కనుక మనకు స్వాతంత్ర్యమేమంటే ఆత్మస్థాయియే స్వాతంత్ర్యము. నీవు ఆత్మభావమును లక్ష్యమునందుంచుకొని నీవు ఏ కార్యమైనా చేయి నీవు తప్పక స్వతంత్రముగా వుంటావు. Individual freedom అనిగాని spiritual freedom అనిగాని రెండు వేరువేరుగా లేవు. ఆధ్యాత్మికమే స్వాతంత్ర్యము. స్వాతంత్ర్యమే ఆధ్యాత్మికము. ఇవి రెండు వేరుగా వుండుటకు వీలు కాదు. ఇవి ఎట్లా వుంటున్నాయనగా ఒకే పదార్థము అనేక భిన్న స్వరూపాలను ధరించింది. పాలు వున్నాయి. పెరుగు చేసుకున్నాము. పెరుగు చిలికాము. వెన్న వచ్చింది. మజ్జిగ నిల్చింది. పాలుగా వున్నది పెరుగు కావటము వెన్న కావటము మజ్జిగ కావటము ఇన్ని రూపాలు చెందింది. ఐతే ఇన్ని రూపములలో వున్న పాలు ఒక్కటే. అదే విధముగనే సాలోక్యం, సారూప్యం, సామీప్యం, సాయుజ్యం ఈ నాలుగు కూడ భిన్నభిన్న రూపములు ధరించింది గాని నాలుగు చివరి ఒక్కటే. ఐతే ఒకదాని కొకటి సోపానములు. సాలోక్యం భగవచ్చింతన చేస్తున్నాం భగవంతుని చింతన చేస్తూ చేస్తూ ఏమైపోతుంది సామీప్యం. స్వామి చింతన చేస్తూ స్వామి దగ్గరగా పోవాలని ఆశపుడుతుంది. సామీప్యము తరువాత స్వామిలో ఐక్యము కావాలి స్వామి వలె వుండాలి అని ఆశిస్తావు. ఈ సారూప్యం పొందాలని ఆశించిన తరువాత సాయుజ్యము కావాలని ఆశిస్తావు. ఇవన్నియూ ఒకదాని యొక్క భిన్న స్వరూపములే గాని వేరువేరు కాదు. కనుక మానవునకు ఈ భౌతిక జగత్తునందు స్వాతంత్ర్యము వున్నదంటే ఇది వెర్రి స్వాతంత్ర్యమనే చెప్పవచ్చు. అహంకార స్వాతంత్ర్యమని చెప్పవచ్చు. అభిమాన స్వాతంత్ర్యమని చెప్పవచ్చు. నా బిడ్డపైన నాకు స్వాతంత్ర్యము వుంటున్నదని నేను కొట్టవచ్చు తిట్టవచ్చు. నా భార్యపైన నాకు స్వాతంత్ర్యము వుందని నేను ఆమెను కొట్టవచ్చు తిట్టవచ్చు. ఇది కేవలము ఏ భ్రాంతియే గాని నీకు ఈ అధికారము లేదు. మంచిని చెప్పవచ్చు. మంచిని బోధించవచ్చు. కొట్టటము తిట్టటము నా స్వాతంత్ర్యము కోటం ఇది కేవలము తెలివి తక్కువ. నిజముగా మానవుడుగా వుండినవాడు మానవునిగా బ్రతకాలనుకుంటే ఈ విధమైన అహంకార చర్యలు మానినప్పుడే మానవుడుగా వ్యవహరిస్తాడు. నిజముగా నాకు స్వాతంత్ర్యము వుంది అని అనుకుంటే నీ ఇష్టము నీకెంత స్వాతంత్ర్యమో ఆమె ఇష్టము ఆమెకంత స్వాతంత్ర్యమే కదా. బయటివారి స్వాతంత్ర్యమును అణగద్రొక్కి నీ స్వత్వమును పెంచుకోవాలనుకోటం నీ స్వార్థము

కదా। నిజమైన స్వాతంత్ర్యమంటే యేమిటి? బయటవారి స్వాతంత్ర్యమునకు అడ్డుతగలకుండుటయే నిజమైన స్వాతంత్ర్యము. కనుక యిట్టి స్వాతంత్ర్యము లోకములో యిట్టి మానవునకు కనుపించదు. ఎవరైనా గలాటా చేస్తుంటే పోలీసువాడు వచ్చి పట్టి కొడతాడు. ఇది నాకు అధికారము వుంది యిది నా స్వాతంత్ర్య మంటాడు. కాని అతనికి అధికారము కాదు అతనికి. తప్పొప్పులు నిర్ణయించుటయే అధికారము అతనికి. అది కూడా అతనికి అధికారము కాదు. ప్రభుత్వము యొక్క నిబంధనలను పురస్కరించుకొని తాను చరిస్తాడు. ఈ విధముగా ఒకదానికొకటి ఒకదానికొకటి పైనపైనే వుండుటంచేత ఎవరికీని స్వాతంత్ర్యము లేదు. అందరికంటె వున్నత స్థాయియందున్న వానిదే స్వాతంత్ర్యము. ఐతే అతనికి రెండవ దనేది లేదు కనుక అక్కడ కూడ స్వాతంత్ర్య మనేది లేదు. కనుక యీ రెండువిధములుగా విచారించినప్పుడు లోకములో ఎవ్వరికిని స్వాతంత్ర్యము లేదు. ఐతే నిత్యజీవితములో Individual freedom, fundamental law అని రెండింటిని మనము అనుసరిస్తున్నాము. జీవనోపాధి నిమిత్తమై ఆచరించే ధర్మము. ఇవి వుండవలసినదే కాని ఎవరు కూడను విసర్జించటానికి వీలు లేదు. Road traffic అనుసరించుకొని మనము ప్రయాణము చెయ్యాలి. సంజయుసహాని చెప్పాడు. ఒక Lady middle road మీద నడుస్తూ యిది స్వాతంత్ర్య మనింది. కాని అది స్వాతంత్ర్యము కాదు. గవర్నమెంటు నిర్ణయానికి విరుద్ధము జరిగినట్లవుతుంది. ఆ విరుద్ధముగా జరిగినప్పుడు గవర్నమెంటైనా పనిష్మెంటు యిస్తుంది ఏలారోయైనా కొట్టి పనిష్మెంటు వస్తుంది. కాని దాని తత్ఫలితమును అనుభవించవలసి వస్తుంది. ఇక్కడ కర్తృత్వము, భోక్తృత్వము అనే ఫలితములను మనము అనుభవించవలసి వస్తుంది. కనుక మానవునకు యేవిధముగా యోచించినప్పటికిని స్వాతంత్ర్యమనేది ఎక్కడ కూడను లేదు. స్వాతంత్ర్యమనే పదమునకు అర్థమే వానికి తెలియదని. స్వాతంత్ర్యమే వుండిన మానవుడు జగత్తుకే రాడు. వానికి జన్మమే లేదు.

ఎప్పుడు యీ దేహమును ధరించి యీ జగత్తుకు వచ్చాడో స్వాతంత్ర్యము లేదు. జయమ్మ చెప్పింది. ఒక పశువును మధ్య గూటానికి కట్టి పెట్టేస్తే అది ఒక పదడుగుల త్రాడైతే పది అడుగుల దూరమే పోగలదు గాని ఆ గూటము చుట్టూ తిరగవచ్చు, గూటము దగ్గరకు వెళ్ళవచ్చును; మధ్యలోనికి పోవచ్చును, కాని దూరము పోలేదు. కాబట్టి దానికి స్వాతంత్ర్యమం ఎక్కడ వుంది. ఒకటి గూటము వుంది రెండవది తగులు వుంది మెడకు. ఇది స్వాతంత్ర్యము కాదు. కనుక మన స్వాతంత్ర్యమనేది కేవలము ఒక హద్దుల లో కూడి వుంటున్నది.

కనుక ఈ హద్దులతో కూడిన దానిని స్వాతంత్ర్యము అని చెప్పకూడదు. నిబంధన అని చెప్పవచ్చు. ఈనాడు పదముల యొక్క అర్థాన్ని సరిగా తెలుసుకోలేక పోతున్నాము. నిజముగా హృదయము నేదానికి సరియైన అర్థము తెలుసుకుంటే దీనికి ఏదో ఒక హద్దులో పెట్టటానికి కాదు. నీలో ఏ హృదయము వుందో ఎదుటి వాని యందు అదే హృదయముంది. నీ యొక్క ఋషి యందు కూడను యిదే హృదయము వుంది. సర్వుల యందు ఒకే హృదయము వుంటున్నాది. సర్వుల యందు ఒకే హృదయము వుండినప్పుడు సర్వుల భావములు ఒకటిగానే రావాలి కదా. ఈ భావములు మనో కల్పితములు.

విద్యార్థులారా! ఈ దేహములు ఈ భావములు ఈ చర్యలు అన్ని కూడను మనసుతో వచ్చినవే కాని హృదయముతో వచ్చేవి కావు. heart అంటే physical heart ఒకటి వుంటున్నాది; spiritual heart ఒకటి వుంటున్నాది. Physical heart కి సంబంధించినది కాదు ఈ heart అంటే. ఇది spiritual heart అనగా సర్వత్రా వుండినది. దీనికి రూపము లేదు గాని అన్ని రూపములు తానే. అన్నింటిలోను తాను ఏకమై వుంటున్నాది. ఏవిధంగా అంటే ఒక చక్కెర పాకము చేసి ఆ చక్కెర పాకము చేత ఏనుగు, కుక్క, నక్క, పులి, గుఱ్ఱము అని అన్ని విధములుగా ప్రింటు కొట్టినాము. చిన్న చిన్న పిల్లలంతా వచ్చి నాకు కుక్క కావాలి, నక్క కావాలి, పులి కావాలి, ఏనుగు కావాలి ఒక్కొక్కరు ఒక్కొక్కటి తీసుకొని భుజిస్తారు. కానీ ఆపిల్లల దృష్టి లోపల యివి కేవలము ఒకవిధమైన జంతువులుగా కనుపిస్తున్నాయి గాని చక్కెరలో ఈ జంతు స్వరూపమే లేదు. ఇది ఏనుగు అన్నాడు. ఇది జింక అన్నాడు. ఇది పులి, యిది సింహము అన్నాడు. ఇది కేవలము వారి దృష్టి యొక్క కల్పితములే. చక్కెరలో ఎట్టి భేదము లేదు. అదే హృదయము. ఈ భేదములన్ని నీయొక్క మానసిక ప్రతిబింబములే. ఒకరిని నీవు ద్వేషిస్తున్నావంటే అది నీయొక్క ప్రతిబింబమే. ఒకరిని ప్రేమిస్తున్నావంటే అది నీ ప్రతిబింబమే. ఒకరిని హాస్యము చేస్తున్నావంటే అది నీ ప్రతిబింబమే. కనుక నీయొక్క reaction rebound reflection మనకు ఈ జగత్తునందు స్వరూప స్వభావములుగా కనుపిస్తున్నవి. కనుక ఈ Reaction, Reflection, Rebound ను విసర్జించి Reality అనే హృదయాన్ని మనము పట్టుకుంటే ఈ భేదములు ఏంతమాత్రము కలుగవు. భగవంతునకు ఎట్టి భేదములు లేవు. కానీ వ్యక్తి యొక్క చర్యలను పురస్కరించుకొని వ్యక్తి యొక్క పూజలను పురస్కరించుకొని, వ్యక్తి యొక్క భావములు పురస్కరించుకొని, వ్యక్తి యొక్క ప్రార్థనలు పురస్కరించుకొని తాను దానికి తగినట్లుగా నటిస్తూ వుంటాడు. భగవంతునికి ఆగ్రహము లేదు

ఇష్టము లేదు అయిష్టము లేదు. ఈ యొక్క తత్వమునందు ప్రతి ఒక్కటి నే ప్రతిబింబము యొక్క స్వరూపములే. దేహమును ధరించుటము చేత అవతారములందు కూడను కొన్ని reactions, reflections, rebounds వుంటాయి. ఈ అవతారమునందు కూడను Reaction, reflection, rebound వుండాలి. ఇతే ఈ భౌతికమైన జగత్తునందు ఆదర్శవంత జీవితమును అందించే నిమిత్తమై ఈరకమైన చర్యలు చెయ్యాలి. భగవంతునికి ఒక కులమునిగాని ఇతడు బ్రాహ్మణుడు ఇతడు క్షత్రియుడు ఇతడు వైశ్యుడు ఈమెస్త్రీ ఇతను పురుషుడు, ఇతను బాలుడు, ఇతను వృద్ధుడు అనే భేద భావములు కేవలము లౌకిక జగత్తునకు మాత్రమే సంబంధించినవిగాని భగవంతునికి ఇట్టి సంబంధము లేదు. రాము ఇక్షత్రియ వంశములో పుట్టినాడు, కృష్ణుడు యాదవ వంశములో పుట్టినాడు సాయి బాబ మా క్షత్రియ వంశములో పుట్టాడు ఈ విధముగా అనుకోటము కేవలము కించిత్ భావములే. భగవంతునికి అట్టి భేదములు యేనాడు లేవు. ఎప్పుడు రావు. కనుక దివ్యమైన ఆత్మతత్వమును మనము అర్థము చేసుకుంటే ఈ సంకుచితమైన మార్గమునకు ఏమాత్రము అవకాశము ఇవ్వరు. ఇవన్నీ సంకుచితమైన తత్వములు సంకుచితమైన భావములు. కనుక ఈ విశాలమైన జగత్తునందు విశాలమైన భావములు మనము పెంచుకొని విశాలమైన ఆత్మ తత్వమును మనము అర్థము చేసుకోవాలి. కనుక ఆధ్యాత్మిక మనగా కేవలము ఒక సంకుచితమైన స్థాయిలో మనము విచారించరాదు. ఏదో పూజలు చేయుటము, భజనలు చేయుటము, ధ్యానము చేయుటము ఇవన్నీ ఆధ్యాత్మిక మనకు చిహ్నములుగా మనము భావిస్తున్నాము. ఇవన్నీ మానసిక వికారములే. మనోతృప్తి నిమిత్తమై మనము ఆచరించే చర్యలే. భగవంతుడే మాకు మాత. భగవంతుడే మాకు పిత భగవంతుడే మాస్నేహితుడు. ఈ విధముగా అనేక రకములుగా వర్ణిస్తూ వుంటాము భగవంతుని. దేవుడు తల్లి తండ్రి స్నేహితుడు ఈ విధమైన భావాలు ఎందుకు. నీవే నేను నేనే నీవు అనుకుంటే పోతుంది కదా. అయితే You and I are one అంటే ఇక్కడ సరిగా సరిపోదు. ఇది ఆధ్యాత్మికము పూర్తి ఖండిస్తుంది. You and I are we. అవుతుందిగాని one కాదిక్కడ. నీలోన నేను వున్నాను. నాలోన నీవు వున్నావు ఇరువురు చేరినపుడు ఒకటై పోతాము. we and we are one. ఇక్కడ రెండు యేమంటే భౌతికమైన దేహమును ధరించిన శరీరము ఒకటి అందులో ఆధారమైన ఆత్మతత్వము ఒకటి వుంటున్నాది. అదే we. ఇక్కడ కూడను భౌతిక సంబంధమైన దేహమును ధరించటము చేత యిది ఒకటి వుంటున్నాది.

యిందులో ఆత్మ తత్త్వము వుంటున్నది. ఇది కూడా యీ. కనుకనే యీ రెండింటి యొక్క తత్త్వ మ్ము గుర్తించుచుంటే నీవు తల్లి తండ్రి స్నేహితుడు యీ రకమైన సంబంధమైతే మనకు అక్కర లేదు. కనుక యిరువురు ఒక్కరే. యిరువురు అనేది లేదు. రెండుగా కనుపించి నప్పటికి అందులో ఒక్కటే. ఇక్కడనే నీకు ప్రత్యక్షముగా యివి రెండుగా కనుపిస్తున్నాయి (ద్వైతములు) కాని యివి రెండూ చేరి ఒకటిగానే వినిపిస్తున్నాయి. కనుపించటము రెండు వినుపించటం ఒక్కటే. కనుక దేహాత్మ భావము, యీ హృదయ తత్త్వము రెండింటిని ఒక్కటిగా చేర్చాలి. అదే మనము చేయవలసిన సాధన.

విద్యార్థులారా! ఆధ్యాత్మికమనగా దైవములో ఏకము కావటమే. దైవము నీవు వేరు కాదు. నీవే దైవము దైవమే నీవు. ఈ విశ్వాసము యీ స్థాయినుండి అభివృద్ధి పరచు కొన్నప్పుడు యింక యే విధమైన ప్రార్థనలు చేయనక్కరలేదు. కాని కొంతమంది వచనముల ద్వారా పలుకుతారుగాని జీవు నేను ఒకటే అని ఆచరణలో శూన్యము. ఒక గురువు ఒక శిష్యు నకు మంత్రోపదేశము చేశాడు శివోహం. ఈ శివోహం అనే పదమును వుచ్చరించ మన్నాడు స్వామి! శివోహం అంటే అర్థమేమిటి అన్నాడు శిష్యుడు. శివోహం నేనే శివుడను. ఆ నిజమే నేనే శివుడను నేనే శివుడను అనుకుంటున్నాడు. నిజముగా, హృదయ పూర్వకముగా తాను దివ్య త్వాన్ని గుర్తించి విశ్వసించి స్మరించటమే అనుకుంటే ఎట్టి బాధములు అతడుకు రావు ఒక స్నేహితుడు వచ్చాడు. శివోహం అని వుచ్చరించుకుంటుంటే అయ్యా యేమి దీని అర్థమ న్నాడు. శివోహం అంటే నేనే శివుడు అని అర్థము చెప్పాడు. నీవే శివుడైతే ఆ పార్వతి నీకు యేమి కావాలి అన్నాడు. నిజముగా విశ్వసించిన వాడైతే పార్వతి కూడా నేనేనని చెప్పవచ్చు కదా. పార్వతి నీకేమవుతుందంటే అపరాధ మపరాధమని పార్వతి నాకంటె గొప్పదని అన్నా డు. ఇట్టి దేహ సంబంధము పురస్కరించుకుంటే యీ వికారాలన్నీ బయలు దేరతాయి. కనుక యీ విధమైన తల్లి తండ్రి యీ భావముతో మనకు అక్కరలేదు. ఈ భౌతిక సంబంధ ము లేమాత్రము మనము అభివృద్ధి పరచుకోరాదు. నీవే నేను నేనే నీవు యీ రకమైన సంబంధమును పెంచుకుంటే బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. ఇంక ఎట్టి బాధములకు అవ కాశము వుండదు. ఇదే నిజమైన స్వాతంత్ర్యము. యిదే నిజమైన స్వేచ్ఛ అదే స్వ-యిచ్ఛ కనుక స్వేచ్ఛ అనేది కేవలము ఎక్కడో వుండినది కాదు. మనము సంపాయించుకున్నది కాదు. మనమే స్వేచ్ఛ.

అందువలనే భగవద్గీత లోపల ధర్మము సంబంధమై గురించి చెబుతూ

స్వధర్మము, పరధర్మము అన్నాడు. పరధర్మమనగా దేహధర్మము. స్వధర్మమనగా ఆత్మ ధర్మ
ము. అంతేగాని స్వధర్మ మంటే క్షత్రియ ధర్మము వైశ్యధర్మము, శూద్ర ధర్మము యీ కుల
ధర్మములకు సంబంధించినది కాదు. స్వ-ధర్మము. ఆత్మ ధర్మము. ఆత్మధర్మము ఎప్పటికి
భయమును అందించదు. ఈ దేహధర్మము ననుసరించినప్పుడే భయము మనకు ఆవిర్భ
విస్తుంది. కనుక గీత యొక్క శ్లోకములను గాని లేక పదముల యొక్క అర్థములను గాని
చక్కగా గుర్తించి వర్తించినప్పుడు ఎట్టి బాధలకుగాని ఎట్టి కష్టములకుగాని మనము గురికాకు
్ండ మన దివ్యత్వమును దివ్యత్వముగానే భావించాలి. అప్పుడు ఎట్టి దుఃఖములకుగాని, కష్టము
లకుగాని నిష్ఠూరములకుగాని యేమాత్రము మనకు అవకాశము చిక్కదు.

విద్యార్థులారా! మీకు తెలియకపోవచ్చు. దివ్యత్వము నకు ఒకటికి రెండను
మార్పు వుండదు. మీరు నమ్మినా నమ్మకపోయినా దుఃఖము అంటే యేమిటో నాకు తెలియ
దు. కష్టమంటే యేమిటో నాకు తెలియదు. నిందలు నిష్ఠూరములు చేస్తున్నారంటే బాధ
అంటే యేమిటో నాకు తెలియదు. అది వాని యిష్టము. పూజ చేయటము నీయిష్టము. ఎవరి
యిష్టము వారిది దానికెందుకు బాధపడాలి. నాభావము ఏమంటే గట్టిగా తిడితే గాలిలో
పోతుంది. తనలో తాను తిట్టుకుంటే తనకే తగులుతుంది. నావరకు రాదే అది. నేనెందు
కు బాధపడాలి. ఈ విధమైన సత్యమైన తత్వాన్ని గుర్తించుకున్నప్పుడు మాత్రము విచా
రము వుండదు. స్వామి! నాకు చాలా బాధగా వుంటున్నాది అని ఏడుస్తారు చాలాసంతోషం
అంటాను. అన్నింటికి సంతోషమే. స్వామి మావారు చనిపోయారు చాలా సంతోషం. ఆసంతోష
మనేది అన్నింటికిని సమత్వమే. ఒక్కొక్కప్పుడు అనుకుంటాను చాలాదుఃఖపడుతున్నారు
బాధపడుతున్నారు ఆదుఃఖము అంటే ఎట్లా వుంటుందోనని. దగ్గరకే రాదు అది. వేరేవాళ్ళ
స్వామికి తగిన స్వామికి సంబంధించిన విచారము లోపల ఏ విధమైన అల్లకల్లోలములో
జరుగుతూ వుంటాయి. అనేకమంది అనేక రకములైన భావములలో వుంటుంటారు. ఒక
వైపున పూజించేవారు ఒకవైపున దూషించేవారు. ఇది ఒక పర్వతము అదే ఒకపర్వత
ము. కాని యీ పర్వతములు రెండూ కూడను గుంతలు వుంటున్నాయి. ఒక దగ్గర మట్టి గు
ట్ట కావాలంటే క్రింద గుంట వుండాలికదా. ఈ గుంటమట్టే గుట్టమట్టి. గుట్టమట్టే గుంట
మట్టి. రెండూ సమానమే. ఈ రకమైన తత్వమే నిజమైన ఆత్మతత్వము. ఇక ఒక్కొక్కప్పుడు
పిల్లలు చేసే పనులు బట్టి కొంచెము కోపపడినట్టుగా చేస్తాను. బయటనేగాని లోపలనుండి
వచ్చినది కాదు. ఒక్కొక్కరితో నెలల కొద్దీ నేను మాట్లాడను. యిది వారి రోగమునకు తగిన

మందు. ఎందుకంటె వారిని సరి చేసే నిమిత్తమై యీ రకమైన మందును వుపయోగపెట్టాలి. స్వామి ఎందుకు నాతో మాట్లాడటం లేదు. అడిగే అధికారం నాకెక్కడ వుంది. అది నాయిష్టం యిప్పుడు దీనికి ఒక చిన్న ఉదాహరణము. ఒక డాక్టరు దగ్గరకు నలుగురు పేషెంట్లు వచ్చారు. నలుగురికి కడుపునొప్పి. బాహ్యదృష్టి తో చూస్తే అందరికి కడుపునొప్పి. ఒకడు వచ్చే ఎప్పటికి ఆ డాక్టరు యేమి చేస్తాడు చూస్తాడు పరీక్షిస్తాడు నాయనా యేమీ లేదు hot water fomentation చేస్తే సరిపోతుందని అంటాడు. వానిని పంపించేస్తాడు తక్షణమే. ఇంకొకడు నాకు కడుపునొప్పి అని వస్తాడు. వానికి సోడా బైకార్బ్, మెగసల్ఫ్ రెండు కలిపి యిచ్చి gas trouble వెళ్లిపోతుంది అంటాడు. మూడవ వాడు వస్తాడు. నాయనా salt యిస్తాను రెండు మూర్లు బేధులై తగ్గిపోతుంది వెళ్లమంటాడు. నాల్గవ వాడు వస్తాడు. Immediate గా operation చేయాలంటాడు. ఏమి వీనిపైన ద్వేషమా డాక్టరుకు కాదు కాదు వీని జబ్బు వేరే ఎపెండిసైటిస్. తక్షణమే ఆపరేషన్ చెయ్యాలి. అదే విధముగనే ఒక్కొక్కరి భావములను ఒక్కొక్కరి చర్యలను ఒక్కొక్కరి తలంపులను పురస్కరించుకొని వారికి తగినది నేనందిస్తాను. ఒక్కొక్కరిని చూడనే చూడను. ఒక్కొక్కరితో మాటాడనే మాట్లాడను. ఒక్కొక్కరు యిటువస్తే అటుపోతాను. ఇవన్నీ నేను చేసే prescriptions ఎందుకోసం యిస్తున్నాను. నాలో ఒక నియమము వుంటున్నది. నా మాటకు చాలా విలువ. మీరు యివ్వక పోయినా నా మాటకు నేను విలువ యిస్తాను. కనుక నా మాటను సరిగా నడుపుకోనప్పుడు నేను వారితో మాట్లాడి వారితో నామాటను waste చేయటం యిష్టము వుండదు. కనుక నా మాటను నేను కాపాడుకొనే నిమిత్తము నేను మాట్లాడకుండా వుంటాను కాని కారణాలు బట్టి. స్వామి నాతో మాట్లాడటం లేదని మాత్రమే చెప్పుకుంటారు గాని నేను స్వామి ఆజ్ఞను నడచుకో లేదని ఎందుకనుకోకూడదు. కేవలము యిది one way traffic కాదు. give and take రెండింటిని విచారణ చెయ్యాలి సమత్వమంటే నేను యీ విధముగా చేయటం చేతనే స్వామి నాతో మాట్లాడటం లేదు అనే దానిని నీవు గుర్తించుకుంటే నీవు మున్ముందు యిక చేయకుండా వుంటావు. కాని యీనాటి భక్తులు ఆ విధముగా చేయటం లేదు. స్వామి మాట్లాడటం లేదు. స్వామి మాట్లాడటంలేదు. అదే చూస్తున్నారు గానీ తాను చేసిన తప్పులు తాను గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. కనుక మొదట స్వామి మాట్లాడమని కోరనక్కరలేదు. నీవు ఆ తప్పు చేయకుండా వుండు స్వామి వచ్చి మాట్లాడుతాడు. వర్షానికి మనము ప్రార్థించుకుంటే వంకలు వాటంతటవే పారి ప్రవహిస్తాయి. వర్షమునకు

ఒక ప్రార్థన, వంకలు ప్రవహించటానికి ఒక ప్రార్థన. ఇన్ని ప్రార్థనలు చేయనక్కరలేదు. ఆజ్ఞను శిరసావహించుకుంటే అనుగ్రహము అక్కడే లభిస్తుంది.

విద్యార్థులారా మొట్టమొదట మీ మాటలకు మీరు విలువ పెట్టుకోండి. మాటలకు విలువ సంపాయించుకోండి. మాటను విలువస్థాయిలో వుంచుకోండి. రెండు కన్నులున్నాయి. రెండు చూడవచ్చు మీరు. రెండు చెవులున్నాయి రెండు వినవచ్చు మీరు. కానీ నాలుక ఒక్కటే వుంది. కనుక

మాటకు ప్రాణము సత్యము
కోటకు ప్రాణము సుభటకోటి ధరిత్రిన్
జాతికి ప్రాణము మానము
నోటుకు ప్రాణంబు వ్రాలు

మన signature లేకపోతే ప్రామిసరీ నోటుకు value ఎక్కడ వుంది. కనుక మనమాటకు సత్యమే ప్రాణము. అప్పుడే సత్యమేవ జయతే. కనుక దైవతత్త్వమును గుర్తించాలనుకుంటే అందరికి అర్థమయ్యేది కాదు. దైవము దేనికి కృంగడు. పొంగడు. ప్రపంచమంతా వచ్చి దూషించినా నేను కృంగను. ప్రపంచమంతా వచ్చి వర్ణించినా నేను పొంగను. నా సత్యము నాది. కృంగి పొంగేవారికి వారిలో వున్న దోషమే reaction. దోషము లేనప్పుడు ఎందుకు కృంగాలి ఎందుకు పొంగాలి. కనుకనే యీ హృదయాస్థాయి యందుండినది ఒకటే అదే పవిత్రము అనే విశ్వాసమును మనము బలపరచుకుంటే యింక యేవిధమైన విచారమునకు అవకాశమే వుండదు.

విద్యార్థులారా! క్రమక్రమేణా మన summer course classes అంతా ముగించటానికి సమీపిస్తున్నాయి. అందువల్ల యిలాంటి అవకాశమనేది దుర్లభము. దీనిని పురస్కరించుకొనియు నేను కొంచెము అధిక కాలము తీసుకొని సంభాషించటానికి అవకాశము యిస్తున్నాను. ఇంక వున్నది రెండు దినములే. ఈ రెండు దినములలో ఏల కూడను స్వామి యొక్క నిజతత్త్వాన్ని, నిజబోధలను, నిజాకారాన్ని సరియైన రీతిలో గుర్తింపచేయటానికి తగినంత అవకాశము వుంటున్నాది. దానిని మీరు అర్థము చేసుకుంటే యింక దేనిని మీరు అర్థం చేసుకోనక్కరలేదు. కుమ్మరింటికి పోయి కుండలన్నీ మట్టితోనే చేసినవని అర్థం చేసుకుంటే కుండలయెన్నైనా పేరుపెట్టుకోవచ్చు. ఆధారము ముందు చూడాలి. కనుక స్వామి యొక్క ఆధారతత్త్వాన్ని మీరు కొంతవరకు గుర్తించటానికి తగిన కృషి

531059017

చేయండి. కేవలము ఆధేయమును మాత్రము గుర్తించటానికి ప్రయత్నించ నక్కరలేదు. ఆధేయము మార్పు చెందేటు వంటిది. ఆధారమే మార్పు చెందనటువంటిది. అదే సత్యము. అదే నిత్యము. అదే ఆత్మ. అదే హృదయము. అదే నేను.